సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 6 । జనవరి । 2023



సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయుల సంక్షేమానికి, పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి అన్నారు. 10లో▸

నేడు కంటి వెలుగుపై జూం మీటింగ్

ఇబ్రహీంపట్నం: కంటి వెలుగు పథకంపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, కలెక్టర్ అమయ్‌కుమార్ జూం మీటింగ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయరాం విజయ్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయానికి హాజరై జూం మీటింగ్‌లో పాల్గొనాలని కోరారు.

14వరకు తిరప్పావై ప్రవచనాలు

హయత్‌నగర్: ధనుర్మాసం పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్‌లోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న తిరుప్పావై ఆరాధనోత్సవాలు ఈనెల 14వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ రణధీర్‌రెడ్డి పేర్కొన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానం అల్వారు దివ్యప్రభంద ప్రాజెక్టు సౌజన్యంతో ప్రతిరోజు స్వామి వారి ఆరాధన, శ్రీమాన్ చిలకమర్రి కృష్ణమాచార్యులచే ప్రవచనాలు ఉంటాయన్నారు.

న్యూస్‌రీల్

ఆమనగల్లు మున్సిపాలిటీకి 'స్వచ్ఛ' అవార్డు



కేటీఆర్ నుంచి అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ 2022 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో జాతీయస్థాయిలో 25 నుంచి 50 వేల జనాభా ఉన్న మున్సిపాలిటీల్లో రెండోర్యాంకు సాధించింది. దీంతో హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని దాశరథి ఆడిటోరియంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌కు అవార్డు అందజేశారు. ఆమనగల్లు స్వచ్ఛ మున్సిపాలిటీగా రెండో ర్యాంకు సాధించడం పై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తుక్కుగూడ మున్సిపాలిటీకి ఓడీఎఫ్ అవార్డు

తుక్కుగూడ: స్వచ్ఛ సర్వేక్షణ్-2022లో భాగంగా తుక్కుగూడ మున్సిపాలిటీని ఓడీఎఫ్‌గా ప్రకటించారు. నగరంలో గురువారం మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, సీడీఎంఏ కమిషనర్ సత్యానారాయణ, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తుక్కుగూడ మున్సిపాలిటీకి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఆదిబట్లకు ఓడీఎఫ్ సర్టిఫికెట్

ఇబ్రహీంపట్నం రూరల్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆదిబట్ల మున్సిపాలిటీకి అరుదైన గౌరవం దక్కింది. బహిరంగ మలమూత్ర, విసర్జనలేని మున్సిపాలిటీగా ఎన్నికైంది. ఈ మేరకు గురువారం నగరంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి మంత్రి కేటీఆర్ ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ సర్టిఫికెట్‌ను అందజేశారు. భవిష్యత్తులో మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కమిషనర్ అమరేందర్‌రెడ్డి తెలిపారు.

తుర్కయంజాల్‌కు గుర్తింపు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌కు ఎంపిక కావడంతో గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సీడీఎంఏ కమిషనర్ డా.ఎన్.సత్యానారాయణ, అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు'పై సమీక్ష



తొలిమెట్టు కార్యక్రమంపై సమీక్షిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ

కడ్తాల్: రాష్ట్రంలో అమలవుతున్న 'తొలిమెట్టు' కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లి ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా 1వ, 3వ, 5వ తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులంతా పాఠ్యాంశానికి అనుగుణంగా బోధనోపకరణాల కృత్యాల (టీఎల్ఎం)ను ఉపయోగిస్తున్న తీరును అభినందించారు. అనంతరం డీఈవో సుశీందర్‌రావు, ఎంఈవో సర్దార్, ఎంఎస్‌వో జంగయ్య, ఏఎంవో వెంకటేశ్, సీఎంవో కృష్ణయ్య, పాఠశాల ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.


పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: పరిశ్రమల ఏర్పాటు కోసం సూక్ష్మ, మధ్య, భారీ తరహా పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జె.రాజేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుద్ధ పరిశ్రమలకు రుణ సదుపాయాల కల్పన, బ్రాండింగ్, మార్కెటింగ్, రైతు ఉత్పత్తిదారుల సహకార సంస్థలకు మద్దతు, మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు నేరుగా బ్యాంకు రుణం సబ్సిడీతో సాయం చేయడం జరుగుతుందన్నారు. పీఎంఈజీపీ పథకం ద్వారా పరిశ్రమల స్థాపన కోసం బ్యాంకు రుణాలు అందజేయనున్నట్లు చెప్పారు. చిన్న తరహా పరిశ్రమదారులు, మహిళా పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనలో ఎలాంటి ఇబ్బందులున్నా ప్రతి సోమవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

31,08,832

జిల్లాలో ఓటర్ల సంఖ్య

- పురుషులు : 16,16,455
- మహిళలు: 14,91,245
- పోలింగ్ స్టేషన్లు : 3,307
- ఓటర్ల తుది జాబితా ప్రకటించిన ఎన్నికల కమిషన్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా ఓటర్ల తుది జాబితా-2023ను ఎన్నికల కమిషన్ గురువారం ప్రకటించింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 3,037 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వీటి పరిధిలో మొత్తం 31,08,851 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. వీరిలో 16,16,455 మంది పురుష ఓటర్లు, 14,91,245 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 368 మంది థర్డ్ జెండర్లు ఉండగా, 182 మంది ఎన్ఆర్ఐ, 582 మంది సర్వీసు ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. నవంబర్‌లో విడుదల చేసిన ముసాయిదాలోని ఓటర్ల సంఖ్య (30,48,200)తో పోలిస్తే.. ప్రస్తుత తుది జాబితాలో 60,651 మంది ఓటర్లు కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. అత్యధికం శేరిలింగంపల్లి.. అత్యల్పం షాద్‌నగర్‌లో.. గతేడాది విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 31,60,455 మంది ఓటర్లు ఉన్నారు. చనిపోయిన వారితో పాటు రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్నవారిని గుర్తించి వారి ఓటు హక్కును తొలగించారు. కొత్తగా 18 ఏళ్ల నిండిన వారికి ఓటు హక్కు కల్పించారు. గత ఏడాది విడుదల చేసిన జాబితాతో పోలిస్తే.. ప్రస్తుతం 51,604 ఓటర్లు తగ్గడం విశేషం. జిల్లాలో అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గాల జాబితాలో శేరిలింగంపల్లి (6,44,138) ముందు వరుసలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ఎల్బీనగర్, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, కల్వకుర్తి, షాద్‌నగర్ ఉన్నాయి. షాద్‌నగర్‌లో అత్యల్పంగా 2,06,302 మంది ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్స్	ఎన్ఆర్ఐలు	సర్వీసు ఓటర్లు
ఇబ్రహీంపట్నం	316	1,48,819	1,42,891	26	13	52
ఎల్బీనగర్	545	2,79,985	2,54,665	92	12	47
మహేశ్వరం	511	2,46,574	2,30,846	61	58	73
రాజేంద్రనగర్	535	2,60,843	2,37,065	29	76	102
శేరిలింగంపల్లి	590	3,42,651	3,01,285	136	18	48
చేవెళ్ల	298	1,21,875	1,16,931	2	4	74
కల్వకుర్తి	262	1,10,975	1,06,061	6	1	134
షాద్‌నగర్	250	1,04,733	1,01,501	16	-	52



కడ్తాల్: పౌరపఠన మందిరాన్ని ప్రారంభించిన మంత్రి సబితారెడ్డి, చిత్రంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

విద్యాభివృద్ధికి కృషి

- మంత్రి సబితారెడ్డి
- ఎక్వాయిపల్లిలో పౌర పఠన మందిరం ప్రారంభం

కడ్తాల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో రాష్ట్రంలోని 5 వేల ప్రభుత్వ పాఠశాలల్లో రీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు విద్యా శాఖ మంత్రి సబితారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో గురువారం విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డితో కలిసి పబ్లిక్ రీడింగ్ రూమ్ (పౌర పఠన మందిరం)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో సర్పంచ్ సుగుణ సాయి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఎక్వాయిపల్లిలో ఏర్పాటు చేసిన పౌర పఠన మందిరం రాష్ట్రంలోనే మొదటిదని, జిల్లాలో మరో 10 ప్రారంభించేందుకు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులతో పాటు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మన ఊరు-మన మనబడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేస్తున్న పాఠశాలల్లో లైబ్రరీ, సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాస్ రూమ్స్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వెనుకబడిన విద్యార్థుల కోసం తొలిమెట్టు ద్వారా 1 నుంచి 5 వతరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పౌర పఠన మందిరాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్ అన్నారు. కార్యకమంలో డీఈవో సుశీందర్‌రావు, డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ మురళీ కృష్ణ, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట గిరి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, సర్పంచ్‌లు సుగుణ, యాదయ్య, భాగ్యమ్మ, భారతమ్మ, ఎంపీటీసీలు ఉమావతి, లచ్చిరామ్‌నాయక్, ఉప సర్పంచ్‌లు ముత్యాలు, వినోద్, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు బంధు అధ్యక్షుడు జోగు వీరయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఉద్యోగాల జాతర

కందుకూరు: తెలంగాణలో ఉద్యోగాల జాతర కొనసాగనుందని, సీఎం కేసీఆర్ 80 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తున్నారని మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన పౌర పఠన కేంద్రాన్ని గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన రోజు, పెళ్లి రోజు, అన్ని ప్రముఖ దినాల్లో ఒక పుస్తకమైనా గ్రంథాలయాలకు విరాళంగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, డీఈఓ సుశీందర్‌రావు, స్థానిక సర్పంచ్ మంద సాయిలు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, రైతు బంధు కమిటీ అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంఖాల్‌లో పబ్లిక్ రీడింగ్ రూమ్ ప్రారంభం

తుక్కుగూడ: జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా మున్సిపల్ పరిధిలోని మంఖాల్‌లో ఏర్పాటు చేసి పబ్లిక్ రీడింగ్ రూమ్‌ను మంత్రి సబితారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగాలకు సిద్ధమయ్యే వారు తాము ఉన్న చోటనే చదువుకునేలా పోటీ పరీక్షల పుస్తకాలతో పబ్లిక్ రీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్, డీఈఓ సుశీందర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్లు రాధమ్మ, మాధవి, కౌన్సిలర్లు బూడిద తేజస్విని, సప్పిడి లావణ్య, బి.రవి నాయక్, రెడ్డిగళ్ల సుమన్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న ఏసీపీ కుశాల్కర్

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

- ఏసీపీ కుశాల్కర్

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఏసీపీ కుశాల్కర్ అన్నారు. షాద్‌నగర్ డిపో నుంచి శబరిమలకు నూతనంగా నడపనున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును గురువారం డీఎం ఉషతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో ప్రధాన భాగమైన ప్రజా రవాణా సంస్థ ఆర్టీసీ మాత్రమేనని అన్నారు. ప్రైవేట్ వాహనాలను అనుభవంలేని డ్రైవర్లు అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయన్నారు. ఆర్టీసీలో అనుభవజ్ఞులైన డ్రైవర్లు ఉంటారని, వేగ నియంత్రణతో బస్సులను నడుపుతారన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆనందరావు, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడ్తాల్: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాల సహకారం ఎంతైనా అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు అన్నారు. మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో గురువారం తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్-2023ను సంఘం జిల్లా అధ్యక్షుడు జి.డేవిడ్, ప్రధాన కార్యదర్శి మునీర్ పాషా, ఉపాధ్యక్షుడు నారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంవో వెంకటేశ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి శంకరయ్య, కార్యదర్శులు అంజయ్య, జగదీశ్, చేవెళ్ల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయానందం, శివానందం, సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో సుశీందర్‌రావు, సంఘం నాయకులు

'ఉపాధి' పనులు సూపర్



షాబాద్: కక్కులూర్‌లో పల్లెప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

షాబాద్: తెలంగాణలో ఉపాధిహామీ పనులు బాగున్నాయని కేంద్ర అధికారుల బృందం కితాబిచ్చింది. మండల పరిధిలోని కక్కులూర్, సర్దార్‌నగర్, కేశారం గ్రామాల్లో గురువారం జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రొఫెసర్ జ్యోతి సత్యపలాథ్, ఢిల్లీ చీఫ్ సలహాదారు ప్రవీణ్ మహత్ బృందం పర్యటించింది. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులు, పల్లెప్రగతి పనులను బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఉపాధిహామీ పథకంలో నిర్మించిన నీటి నిల్వ గుంతలు, పశువుల షెడ్లు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. వైకుంఠధామం, పల్లెప్రకృతివనం, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, కంపోస్ట్‌యార్డులు ప్రజలకు అందుబాటులోకి తేవడం బాగుందన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. హరితహారం నర్సరీలు, పల్లెప్రకృతివనాలు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, కంపోస్ట్‌యార్డుల ఏర్పాటుతో గ్రామాలన్నీ స్వచ్ఛత దిశగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమలో రాష్ట్ర గ్రామీణభివృద్ధిశాఖ స్పెషల్ కమిషనర్ ప్రసాద్, జాయింట్ కమిషనర్ ప్రదీప్‌శెట్టి, డీఆర్‌డీవో ప్రభాకర్, జెడ్పీ సీఈవో దిలీప్‌కుమార్, డీపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, ఎంపీడీఓ అనురాధ, సర్పంచ్‌లు భానూరి మమత, చల్లా సంధ్యారాణి, మునగపాటి స్వరూప, ఎంపీటీసీ కరుణాకర్, ఏపీడీ నీరజ, డీఎల్పీవో శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఎంఈవో శంకర్‌రాథోడ్, ఏపీవో వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు, ఎంపీవో మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బృహత్ పల్లె ప్రకృతి వనం సందర్శన

నందిగామ: మండల పరిధిలోని చేగూరు శివారులో ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని కేంద్ర అధికారుల బృందం గురువారం సందర్శించింది. ప్రకృతి వనంలో నాటిన మొక్కలు, సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి సర్పంచ్ సంతోషను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా సుమారు 8 ఎకరాల్లో ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనం భవిష్యత్తులో ఒక వనంలా అవుతుందని, పరిసర గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని బృందం సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర బృందం అధికారులు అమర్జిత్ సిన్హా, అశోక్ పంకజ్, ప్రవీణ్ మాన్తో, సర్పంచ్ మామిళ్ల సంతోష, ఎంపీపీ ప్రియాంక, జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, అటవీ శాఖ కమిషనర్ ప్రసాద్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మామిళ్ల విఠల్, తహసీల్దార్ రెహమాన్ ఖాన్, ఎంపీఓ గిరిరాజ్, ఏఈ కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గుట్టుగా రసాయన వ్యర్థాల డంప్

- చెరువులు, బహిరంగ ప్రదేశాలే అడ్డా
- ఫార్మా కంపెనీల ఇష్టారాజ్యం
- తాజాగా డంప్ చేస్తూ పట్టుబడిన ట్యాంకర్
- కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్





రసాయన వ్యర్థాలు డంప్ చేస్తూ పట్టుబడిన ట్యాంకర్, (ఇన్‌సెట్) కంపెనీ గేటు ఎదుట ఆయా పార్టీల నాయకులు, స్థానికుల ఆందోళన

తుర్కయంజాల్: ప్రమాదకర రసాయన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపులా, చెరువులు, కుంటల్లో డంప్ చేయకూడదని నిబంధనలు చెబుతున్నా కొన్ని ఫార్మా కంపెనీల యాజమాన్యాలు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. రసాయన వ్యర్థాలను సరైన రీతిలో శుద్ధి చేయడం ఖర్చుతో కూడుకున్న పని కావడంతో సులువుగా రాత్రి వేళ ఔటర్ రింగ్ రోడ్డుకు ఇరువైపులా, దగ్గరలోని చెరువుల్లో వదలడం పరిపాటిగా మారింది. తాజాగా తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లిలోని కాంకర్డ్ డ్రగ్స్ లిమిటెడ్‌కు చెందిన రసాయన వ్యర్థాలను బుధవారం రాత్రి ట్యాంకర్‌లో తెచ్చి పరిసర ప్రాంతాల్లో పారబోయడానికి ప్రయత్నిస్తుండగా స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. పీసీబీ (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) ఏఈ మహేశ్ శాంపిల్ సేకరించారు. పరీక్షల అనంతరం వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. హయత్‌నగర్ పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

చెరువులో కలుషిత వ్యర్థాలు

కాంకర్డ్ డ్రగ్స్ కంపెనీకి ఆనుకుని బ్రాహ్మణపల్లి చెరువు ఉంది. వరుసగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చెరువు మూడేళ్లుగా నిండుకుండలా మారింది. ఇదే అదనుగా సదరు కంపెనీ నిర్వాహకులు ఏడాది క్రితం చెరువులో ప్రమాదకర వ్యర్థాలను వదలడంతో చేపలన్నీ మృత్యువాత పడ్డాయి. ఆ సమయంలో సాక్షిలో కథనం ప్రచురించడం, స్థానికులు, మత్స్యకారులు ఆందోళనకు దిగడంతో దిగి వచ్చిన సదరు కంపెనీ యాజమాన్యం ఇక మీదట వ్యర్థాలు చెరువులో చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. చనిపోయిన చేపలకు నష్ట పరిహారం చెల్లించడంతో పరిస్థితి సద్దుమణిగింది. ప్రస్తుతం తిరిగి చెరువులోని నీటిపై నల్లటి తెట్టు పేరుకుని దుర్వాసన వెదజల్లుతోంది. ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం ఉచితంగా పంపిణీ చేసిన చేప పిల్లలతోపాటు సొంత డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసి చేపపిల్లలను చెరువులో వదిలారు. దీంతో చేపలు మృత్యువాత పడతాయిని అటు మత్స్యకారులు, వ్యర్థ రసాయనాల కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని ఇటు స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.

కంపెనీ ఎదుట ఆందోళన

బహిరంగ ప్రదేశంలో రసాయన వ్యర్థాలను పారబోస్తున్న కాంకర్డ్ డ్రగ్స్ కంపెనీ గేటు ఎదుట గురువారం కౌన్సిలర్ కొంద్రు మల్లేశ్, బ్యాంకు డైరెక్టర్లు కొంద్రు స్వప్న, చాపల యాదగిరి, టీఆర్ఎస్ నాయకుడు మర్రి సంపతీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కొంతం వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య, సీపీఎం నాయకుడు డి.కిషన్‌తో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్న ప్రభుత్వాలు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్‌ఐ నేతలు

డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

ఇబ్రహీంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నడూలేనంతగా నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నాయని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కమిటీ సమావేశం బుధవారం ఇబ్రహీంపట్నంలోని పాష నరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన ప్రధాన మోడీ... ఉన్న ఉద్యోగులను తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పోలీస్ నియామకాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేహదారుఢ్య పరీక్షల్లో లాంగ్ జంప్ దూరాన్ని పెంచడం, ఎత్తు కొలతలు డిజిటల్‌గా తీసుకోవడంతో చాలామంది అభ్యర్థులు నష్టపోయినట్లు తెలిపారు. రన్నింగ్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులందరినీ మెయిన్స్‌లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రిలిమినరీ పరీక్ష ప్రశ్నపత్రాల్లో దాదాపు 22 ప్రశ్నలు తప్పుగా ముద్రించారని చెప్పారు. మల్టిపుల్ ప్రశ్నలకు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు బాధ్యత వహించి 7మార్కులు కలపాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా నేటికి ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఏడు మార్కులు కలిపితే 50 వేల మంది అభ్యర్థులు క్వాలిఫై అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ మార్కులను తక్షణమే కలపాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం సమాఖ్య 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షులు జక్కిడి అనిల్‌రెడ్డి, పి. జగన్, జిల్లా ఉపాధ్యక్షులు అలంపల్లి జంగయ్య, నాయకులు శివశంకర్, స్వామి, రాఘవేందర్, మల్లేష్, ప్రభు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన చిలుకూరు మల్లికార్జునస్వామి ఆలయం
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఆలయ కమిటీ సభ్యులు

మొయినాబాద్: నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జరగనున్న బ్రహ్మోత్సవాలకు చిలుకూరు సురకంటి భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం ముస్తాబైంది. ఈ నెల 7నుంచి 10వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతిఏటా సంక్రాంతి పండుగకు ముందు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. శనివారం సాయంత్రం గంగస్నానంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 8వ తేదీ ఆదివారం ఉదయం 9గంటలకు ధ్వజారోహణం, అభిషేకం, 10గంటలకు ఎల్లమ్మ లగ్నం, మధ్యాహ్నం 2గంటలకు ఎల్లమ్మ బోనాలు, మధ్యాహ్నం 2.15 గంటలకు భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం, సాయంత్రం 4గంటలకు స్వామివారి బోనాల ఊరేగింపు, 5గంటలకు శివసత్తులు అగ్నిగుండాలు తొక్కుట, 5.30గంటలకు ఒగ్గువారు ఉక్కుగొలుసు తెంపుట, రాత్రి 8గంటలకు ఒగ్గకథ కార్యక్రమాలు ఉంటాయి. 9వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు సదరు పటం తొక్కుట, సాయంత్రం 5గంటలకు చిలుకూరు గ్రామంలో ఊరేగింపు, 10వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు నల్లపోచమ్మ బోనాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. మండలంలోని అన్ని గ్రామాలతోపాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలివచ్చి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగెరి మల్లేష్ తెలిపారు. బ్రహ్మోత్సవాల కోసం ఆలయం వద్ద భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన మల్లికార్జునస్వామి ఆలయం

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి



తలకొండపల్లి పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న చెన్నకేశవరెడ్డి

తలకొండపల్లి: ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తూ, పాఠశాలల సమస్యలను పరిష్కరిస్తానని పీఆర్‌టీయూ టీఎస్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీఆర్‌టీయూ టీఎస్ తరుపున చెన్నకేశవరెడ్డి బరిలో నిలిచారు. గురువారం తలకొండపల్లి, చుక్కాపూర్, ఖానాపూర్, పడకల్, గట్టుఇప్పలపల్లి, చంద్రధన, వెల్జాల్, రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. 317 జీఓ ఉప సంహరణ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకంపై చర్చిస్తామని వివరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భగ్వాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, ఆమనగల్లు, కడ్తాల మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, చందర్, పద్మావతి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఓయూలో కారు బీభత్సం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో గురువారం రాత్రి లేడీస్ హాస్టల్ సమీపంలో కారు బీభత్సం సృష్టించింది. యూనివర్సిటీ సెక్యూరిటీ అధికారి రాహుల్ కథనం మేరకు.. లేడీస్ హాస్టల్ సమీపంలో వేగంగా వచ్చిన కారు ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు స్పీడ్‌బ్రేకర్ కనిపించకపోవడంతో ఐక్రీమ్ బండిని ఢీకొని ఫుట్‌పాత్ పైకి దుసుకెళ్లింది. దీంతో ఇద్దరువిద్యార్థులకు గాయాలయ్యాయి.

మానవత్వం చాటుకున్న మాజీ ఎంపీ

- ప్రమాదంలో గాయపడిన దంపతులకు ప్రథమ చికిత్స
- నగరంలోని ఆస్పత్రికి తరలింపు



దంపతులకు చికిత్స చేస్తున్న మాజీ ఎంపీ

యాచారం: సాగర్ రోడ్డులో ప్రమాదానికి గురై తీవ్ర గాయాలైన దంపతులకు ప్రథమ చికిత్స చేసి మానవత్వాన్ని చాటుకున్నారు మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్. యాచారం మండల కేంద్రంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి ఇరుముడి పూజకు హాజరై తిరిగి నగరానికి వెళ్తుండగా మార్గ మధ్యలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన కొర్ర బుచ్చనాయక్, ఆయన భార్య సంధ్య మోటార్ సైకిల్‌పై నుంచి జారి పడ్డారు. తీవ్రగాయాలైన వీరికి మాజీ ఎంపీ, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ వారికి ప్రథమి చికిత్స చేసి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి పంపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తూరు: లారీ బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన కొత్తూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాజేంద్రనగర్ మండలం గగన్‌పహాడ్‌లో నివాసం ఉండే మాన రాఘవేందర్(26) నందిగామలోని ప్లాస్టిక్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా గగన్‌పహాడ్ నుంచి బైకుపై మరో కార్మికుడు హరిపద్ జేనాతో కలిసి బయలుదేరారు. వీరు కొత్తూరు వై జంక్షన్ వద్దకు రాగానే వెనక నుంచి వచ్చిన లారీ అతివేగంతో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాఘవేందర్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మాన విశ్వనాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్ల విస్తరణ, మరమ్మతులకు నిధులు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం విజయవాడ రహదారి, పీర్లగూడ వద్ద రోడ్డు మరమ్మతులకు రూ. 50లక్షలు, ఘట్కేసర్ నుంచి అనాజ్‌పూర్ మీదుగా తారామతిపేట్ రోడ్డుకు రూ. 103.50లక్షలు, సాగర్ పీడబ్ల్యూడీ రోడ్డు పోచారం వయా ఉప్పరిగూడ రూ. 185లక్షలు, ఎల్మినేడు నుంచి తులేకలాన్ రోడ్డు రూ. 60లక్షలు, మంచాల్ నుంచి ఆగాపల్లి వయా జాపాల్‌కు రూ. 215లక్షలు, ఏపీపీ రోడ్డు నుంచి చెన్నారెడ్డిగూడ రూ. 42లక్షలు, చిత్తాపూర్ నుంచి ఆరుట్ల వరకు రూ. 54లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తులేఖర్దు వయా చౌదర్‌పల్లికి రూ. 166లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కొత్తపల్లి వరకు రూ. 91లక్షలు చొప్పున మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. అలాగే కల్వర్టుల నిర్మాణానికి రూ. 20కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మరో రూ. 25కోట్లతో ఇప్పటికే సింగిల్ రోడ్లను డబుల్‌గా మార్చనున్నారు. ఇప్పటికే వీటి పనులు ప్రారంభం అయ్యాయి. నియోజకవర్గంలోని రోడ్లనన్నింటినీ బాగు చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో పెండింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు దగ్గరుండి పనులు పర్యవేక్షించాలని, అవినీతి అక్రమాలు జరగకుండా చూడాలని తెలిపారు.

నిందితుడి అరెస్ట్

చైతన్యపురి: చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్కాపురిలో గత నెల చోటుచేసుకున్న కాల్పుల కేసులో ప్రధాన నిందితుడిని, అతనికి ఆశ్రయం కల్పించిన మరో వ్యక్తిని అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ కథనం మేరకు.. డిసెంబర్ 1న అల్కాపురిలోని మహదేవ్ జువెలరీ షాపులో కాల్పులు జరిపి మూడు కేజీల బంగారు ఆభరణాలు, రూ.3లక్షల నగదు దోచుకెళ్లిన విషయం తెలిసిందే. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు గత నెల 7న అంతర్రాష్ట్ర ముఠాలోని ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు గజ్వేల్‌లోని జయలక్ష్మి జువెలర్స్ నిర్వాహకుడు మహేందర్ తప్పించుకుని తిరుగుతున్నాడు. గురువారం ఎల్బీనగర్ చిత్ర లేఅవుట్ ప్రాంతంలో అతడిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అతనితో పాటు మహేందర్‌కు ఆశ్రయం ఇచ్చిన సైదాబాద్ సింగరేణి కాలనీకి చెందిన ప్రకాష్‌చౌదరిని కూడా అరెస్ట్ చేశామన్నారు. ఘటన అనంతరం మహేందర్ ఢిల్లీ, జోద్‌పూర్, బెంగళూరు ప్రాంతాల్లో సంచరించినట్లు గుర్తించారు. గత నెల 13న జోద్‌పూర్ నుంచి నగరానికి వచ్చి మళ్లీ గిజోద్‌పూర్ వెళ్లాడు. బిల్వాడా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వదిలి పెట్టిన ఎర్టిగా కారును తీసుకురావాలని తన స్నేహితుడు ప్రకాష్‌ను కోరాడు. అదే కారులో తిరిగి రాగా అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి సహకరించని మంత్రి

- కార్పొరేటర్ శ్రీవాణి
- నిధులు రాక పనులు చేయలేదని ఆవేదన
- భారమైన హృదయంతో లేఖ రాస్తున్నానని వెల్లడి

హుడాకాంప్లెక్స్: డివిజన్ అభివృద్ధికి మంత్రి సబితారెడ్డి సహకరించడం లేదని, దీంతో ఆశించిన మేర ప్రగతి సాధించలేకపోయామని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి పేర్కొన్నారు. తనను గెలిపించిన సరూర్‌నగర్ డివిజన్ ప్రజలకు భారమైన హృదయంతో లేఖ రాస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన లేఖను గురువారం ఆమె విడుదల చేశారు. డివిజన్ ఓటర్ల ఆశీర్వాదంతో తాను కార్పొరేటర్‌గా గెలిచి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పది వేల ఉత్తరాలు రాసినట్లు ఆమె తెలిపారు. డివిజన్ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానని, కానీ నిధుల కోసం జోనల్ కమిషనర్, మేయర్, డిప్యూటీ కమిషనర్ పలుమార్లు కలిసి వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇక్కడి సమస్యలను మంత్రి సబితారెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నుంచి ఎప్పుడూ ఒకే సమాధానం వస్తోందని, అదేమిటంటే రాష్ట్రంలో నిధుల కొరత ఉందని, కొన్ని పనులు మంజూరు అయ్యాయని, కొన్ని పనులు టెండర్ దశలో ఉన్నాయని, కొన్ని పనులు చేయడానికి కాంట్రాక్టర్లు రావట్లేదని చెబుతున్నట్లు ఆమె తెలిపారు. టెండర్ ప్రక్రియకు నోచుకున్నా బిల్లులు చెల్లించలేదని చెప్పి పనులను మధ్యలోనే ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత దయనీయ స్థితిలో కూడా వెనకడుగు వేయకుండా ప్రజలతో కలిసి పోరాడతానని లేఖలో వెల్లడించారు. ఈ రెండు సంవత్సరాల్లో గొప్పగా సాధించింది ఏమిటంటే సరూర్‌నగర్ డివిజన్‌ను పూర్తిగా డిజిటలైజ్ చేశానని, ప్రతి ఒక్క సమస్యను సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

తండ్రి కాళ్లు నరికిన కుమారుడికి జైలు



పర్వతాలు (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: ఆస్తి కోసం తండ్రి కాళ్లు నరికిన కొడుకుకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం అడిషనల్ అసిస్టెంట్ సివిల్ జడ్జి నాగరాజు గురువారం తీర్పు వెల్లడించారు. 2022 సంవత్సరంలో యాచారం మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన మోగిలమోని పర్వతాలు(39) ఆస్తి కోసం తన తండ్రి కాళ్లు నరికాడు. యాచారం పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. కేసును పరిశీలించిన న్యాయమూర్తి తీర్పు నిందితుడికి శిక్ష విధించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆరోగ్యం బాగు



స్వామిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు, పోలీసులు

బడంగ్‌పేట్: రెండేళ్ల క్రితం సంతోష్‌నగర్ ప్రాంతంలో మతిస్థిమితం సరిగ్గాలేని ఓ వ్యక్తి(42)ని మాతృదేవోభవ అనాథ, మానసిక దివ్యాంగుల ఆశ్రమ నిర్వాహకులు చేరదీశారు. అతనికి ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో చికిత్స చేయించారు. రెండేళ్ల తర్వాత అతని ఆరోగ్యం కుదుటపడింది. తన పేరు ముక్కెర స్వామి, మాది హైదరాబాద్‌లోని సైదాబాద్ అని, కుటుంబ సభ్యుల వివరాలు తెలిపాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మతిస్థిమితం లేని ముక్కెర స్వామి ఎక్కడికో వెళ్లి చనిపోయి ఉంటాడని భావించామని, అతని సోదరి, సోదరులు ములగర అండాలు, ముక్కెర రాజేశ్వర్‌రావు, రాజ్‌కుమార్‌లు కన్నీటి పర్యంతమయ్యారు. గురువారం స్వామిని ఆదిబట్ల ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్‌ఐ సురేష్‌ల సమక్షంలో ఆశ్రమ నిర్వాహకులు గట్టు గిరి కుటుంబ సభ్యులకు అప్పగించారు.